## మిషన్ భగీరథ సరఫరాలో కలుషితమవుతున్న మంచి నీరు

**మిరుదొడ్డి, జూలై 29, ప్రభాతవార్త :** అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులతో పాటు కలుషిత ఆహారం కలుషిత నీటితో టైఫాయిడ్ డయేరియా(వాంతులు, విరేచనాలు) లాంటివి సంక్రమించే ప్రమాదం ఉంది. ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు అందించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు అందిస్తోంది. గత కొద్ది రోజులుగా మండల కేంద్రంలో నల్లాల ద్వారా కలుషితమైన నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. కలుషితమైన నీరు తాగితే అస్వస్థత గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడో ఒకచోట పైపులు లీకేజీతో వర్షపు నీరు చేరి నీరు కలుషితమవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మిషన్ భగీరథ అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి మంచినీటి సరఫరాలో భాగంగా పైపుల లీకేజీని అరికట్టి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ప్రజల సమస్యలను పట్టించుకొని కౌన్సిలర్

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు**

**సిద్దిపేట రూరల్, జూలై 29, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో ప్రజల సమస్యలను పట్టించుకునే కౌన్సిలర్ సైతం ఆటు వైపు చూడడం లేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వార్డులో ప్రజా సమస్యలు పేరుకుపోయాయని సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నపాటి వర్షం కురిసిన వర్షం నీరు రోడ్లపై నిలుస్తుందని వర్షంతో డ్రైనేజీలోని నీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల సూచన మేరకు వార్డులో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటే కౌన్సిలర్ సతీష్ బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్ వ్యవహరిస్తున్న తీరును అవసరమైతే మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. 9వ వార్డులో ప్రజా సమస్యలపై ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన ఆందోళన చేస్తామన్నారు. ఆయన వెంట గయాజుద్దీన్, నవాజ్, అనిల్ తదితరులు ఉన్నారు.



వనదుర్గా భవాని ఆలయం ముందు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

## ఏడుపాయల్లో తగ్గిన నీటి మట్టం

**పాపన్నపేట, జూలై 29, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గ భవానిమాత ఆలయం ముందు నుంచి ప్రవహిస్తున్న మంజీర నీటి ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఆలయం ముందునుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మూడు రోజుల క్రితం ఆలయాన్ని మూసివేసి రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆలయం ముందు నుంచి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడం, రాత్రికి మంజీరా నది ఎగువ ప్రాంతంలో వర్షాలు పడకుంటే ఆదివారం నుంచి ఆలయ గర్భగుడిలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## ప్రభుత్వం ఐదు అంచెల వ్యవస్థతో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుంది

**మంత్రి తన్నీరు హరీష్‌రావు**



పిహెచ్‌సి సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీష్‌రావు

**నంగునూర్, జూలై 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఐదు అంచల వ్యవస్థతో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుందని రాష్ట్ర అర్థిక,ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని గట్ల మల్యాల గ్రామంలో శనివారం రూ. కోటి 63 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సెంటర్‌కు రూ. కోటి 33 లక్షలతో అక్కనపల్లి నుంచి సీతారాం పల్లి వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనులకు, రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన మురికి కాల్వల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పీరిలకు దత్తి కట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గట్ల మల్యాలలో పిహెచ్‌సి సెంటర్ ఏర్పాటు చేయడం వలన వాగు అవతలి గ్రామాలకు ఒక వరం లాంటిందన్నారు. పిహెచ్‌సి సెంటర్ అరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు తడిసిన ఉమా, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రేణుక వేణుగోపాలచారి, దువ్వల మల్లయ్య, వేముల వెంకటరెడ్డి, సంగు పురేందర్, రమేష్, శ్రీకాంత్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో కురుస్తున్న వర్షాలతో అక్కనపల్లి వాగు ప్రవాహం పెరిగిన దరిమిలా మంత్రి హరీష్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కొబ్బరి కాయ కొట్టి పసుపు, కుంకుమ చల్లి పూలతో గంగమ్మకు జలాభిషేకం చేశారు.

## మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

**టిపిసిసి ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్**



మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

**నర్సాపూర్, జూలై 29 ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్ అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ సమక్షంలో నర్సాపూర్ పట్టణానికి చెందిన పలువురు ముస్లిం నాయకులు, యువకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కులమతాల కతీతంగా సోదరభావంతో అందరిని కలుపుకొని నడిచే పార్టీ అని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయి తప్ప బిఆర్ఎస్ పార్టీ పాలనలో అభివృదికథ శూన్యమని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు దొందు దొందేనని ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం మొహర్రం పండగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, నాయకులు ఆంజనేయులుగౌడ్, మాజీ జడ్పిటీసి శ్రీనివాస్‌గుప్త, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేషం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, శ్రీశైలంయాదవ్, రశీద్, ఉదయ్‌కుమార్, సర్పంచ్ శివకుమార్, సంగసాని నర్సింగరావు, బ్రాహ్మణపల్లి నర్సింలు, నందు, మణిదీప్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల సమస్యలు పరిష్కరించాలి

**నర్సాపూర్, జూలై 29, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ మున్నూరు కాపుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని మున్నూరు కాపు సంఘం నాయకులు కోరారు. శనివారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం నాయకులు ఒక బహిరంగ లేఖను సిఎం కెసిఆర్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు సంగసాని సురేశ్, శంకర్, బాల్‌రాజు, సతీష్, యాదయ్య, వెంకటేశ్, ప్రశాంత్, గౌతమ్, శివ,సంజయ్ తదితరులున్నారు.



కెసిఆర్‌కు పంపిన బహిరంగ లేఖను చూపిస్తున్న సంఘం నాయకులు

# విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరైందికాదు

### మంత్రి హరీష్‌రావు

**కొండపాక, జూలై 29, ప్రభాతవార్త :** మూడు పంటలకు నీరు ఇచ్చేవారు కావాలా మూడు గంటల కరెంటు ఇచ్చేవారు కావాలా ప్రజలే నిర్ణయం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. కుకునూర్‌పల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామంలో సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి అధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేసి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం కెసిఆర్ 24 గంటలు కరెంటు ఇస్తుండగా కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు సరిపోతుందని అనడం సరి అయింది కాదన్నారు. రైతులను నష్టపరిచే విధంగా మూడు నల్లా చట్టాలను తీసుకవచ్చిన బిజెపి మూడు గంటలు కరుంటు ఇస్తానన్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. సిఎం కెసిఆర్ పాలనలో తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలు జరిగి సస్యశ్యామలంగా మారిందన్నారు. తెలంగాణ నాయకులను అడ్డుపెట్టుకొని మళ్లి ఆంధ్ర నాయకులు తెలంగాణలో అడుగుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ప్రమాణ స్వీకారోత్సవాల్లో మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రావడం దేనికి సంకేతమన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు నాయుడు నా గురువని చెబుతుండగా కిషన్‌రెడ్డి మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి గురువులాంటి వారని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆంధ్ర నాయకుల చెప్పులు మోసే వారు మనకు అవసరమా అని ప్రశ్నించారు. సిఎం కెసిఅర్ పరిపాలనలో మంగోల్‌లో రూ.19 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మల్లన్నసాగర్ నిర్మాణంతో బీడు భూములు సస్య శ్యామలంగా మారయన్నారు. దేధశంలో ఎక్కడ లేని విధంగా 24 గంటలు ఉచిత కరెంటు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతకుముందు కుకునూర్‌పల్లి రూ. 3.86 కోట్లతో నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ తదితరులు మాట్లాడారు. ఆయాకార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు డాక్టర్ యాదవరెడ్డి, వేలేటీ రోజాశర్మ, సీపీ శ్వేత అడిషన్ డిసిపి అడ్మిన్ మహేందర్, చిట్టి దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనంతుల అశ్విని ప్రశాంత్, ర్యాగల సుగుణ దుర్గయ్య, చింతల సాయిబాబా, ప్రశాంత్, కోల సద్గుణ రవీందర్, పొల్కంపల్లి జయంతి నరేందర్, కోల శ్రీనివాస్, చిట్యాల హరిత సంతోష్‌రెడ్డి, భూములుగౌడ్, అమర్, నూనె కుమార్‌యాదవ్, సీఐ కమలాకర్, ఎస్ఐ పుష్పరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## గజ్వేల్ అభివృద్ధి సిఎం కెసిఆర్‌తోనే సాధ్యమైంది

**-కెమిస్ట్ డ్రగ్గిస్ట్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు**

**గజ్వేల్, జూలై 29 (ప్రభాతవార్త):** దేశంలో ఎక్కడా లేనివిధంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌కు నూతన భవనం నిర్మించడం సిఎం కెసిఆర్‌తోనే సాధ్యమైందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ద్వారక వెంచర్‌లో నూతనంగా నిర్మించిన కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ భవనాన్ని టిటిసిడిఏ రాష్ట్ర అధ్యక్షుడు రేణికింది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా గజ్వేల్, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్ తదితర ప్రాంతాలలో కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌లకు నూతన భవనాలు ఏర్పాటు చేశామన్నారు. గజ్వేల్ పట్టణంలో అన్ని కులాలకు, యూనియన్లకు స్థలాన్ని ఇచ్చి భవనాలను నిర్మించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, దేశానికే గజ్వేల్ రోల్‌మోడల్‌గా ఉందన్నారు. టిటిసిడిఏ రాష్ట్ర అధ్యక్షుడు రేణికింది శ్రీనివాస్ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో కెమిస్ట్ డ్రగ్గిస్ట్ భవనం నిర్మించినందుకు సిఎం కెసిఆర్‌కు, మంత్రి హరీష్‌రావుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. హైద్రాబాద్‌లో కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భవనం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి హరీష్‌రావును కోరిన వెంటనే స్పందించి సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, శాసనమండలి సభ్యులు డాక్టర్ వి.యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్ ఎంపిపి అమరావతి, జెడ్‌పిటిసి పంగ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, టిటిసిడిఎ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, కోశాధికారి తొడుపునూరి రాజు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అయిత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వేముల వెంకటేశ్వర్‌రావు, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, గజ్వేల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు పేర్ల దేవదాస్, ప్రధాన కార్యదర్శి సీత యాదగిరి, కోశాధికారి జనగామ రాజాగౌడ్ పాల్గొన్నారు.



ములుగులో మోడల్ పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

## ములుగులో మోడల్ పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపన

**ములుగు, జులై 29 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో అన్ని హంగులతో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మించడం జరుగుతుందని హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. శనివారం ములుగులోని రైతువేదిక పక్కన రాజీవ్‌రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పోలీస్‌స్టేషన్ భవనానికి మంత్రి హరీష్‌రావుతో కలిసి సర్పంచ్ బట్టు మాధవి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. అంతకుముందు హోంమంత్రి మహమూద్‌అలీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని అన్నిహంగులతో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్‌స్టేషన్ రాజీవ్‌రహదారికి పక్కనే ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాజీవ్‌రహదారికి పక్కన ఉండడం వల్ల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. గత పాలకుల చేతిలో అభివృద్ధికి నోచుకోని తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్‌పి చైర్మన్ రోజాశర్మ, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత, అడిషనల్ డిసిపి మహేందర్, గడా అధికారి ముత్యంరెడ్డి, ఏఎంసి చైర్మన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఎంపిపి లావణ్య అంజన్‌గౌడ్, జెడ్‌పిటిసి జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపిపి ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు జుబేర్, నాయకులు లింగారెడ్డి, గణేష్‌గుప్త, ఎంపిటిసిలు ప్రవీణ్, హరిబాబు, సత్తయ్యచారి, పోలీస్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సిఎం సహాయ నిధి పేదలకు వరం

**కొండపాక, జూలై 29, ప్రభాతవార్త :** సిఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని భారత జాగృతి గ్రేటర్ హైదారాబాద్ అధ్యక్షులు అనంతుల ప్రశాంత్ అన్నారు. శనివారం కొండపాకలో అయన స్వగృహంలో అరుట్ల ఎల్లవ్వ, మంతూరి స్వామి, బండారి కనకయ్య, బండారి రాజయ్యలకు రూ. ఒక లక్ష 70 వేల విలువలగల చెక్కులను అందజేసి మాట్లాడారు. నిరుపేదలు కార్పోరేట్ వైద్యం చేయించుకోవడానికి ప్రభుత్వం సిఎంఅర్ఎఫ్‌ను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చేపల పెంపకం-అమ్మకంతో ఉపాధి

**జిల్లాలోని జలశయాలతో అనువుగా మారిన చేపల పెంపకం.. 243 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 18500 మంది సభ్యులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కాళేశ్వరంతో చెరువు,కుంటలలో జిల్లాలో గోదావరి జలాలు నింపడంతో యేడాది పొడువున చెరువులు, కుంటలు నిండుకుండల్లా దర్శినమిస్తున్నాయి. జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులోభాగంగా నిర్మించిన మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ జలాశయాలతో పాటు జిల్లాలోని 1634 చెరువులు, కుంటలు ఉండడంతో చేపల పెంపకానికి ఎంతో అనువుగా మారింది. నీటి వనరుల లభ్యతతో రైతులకు సాగునీరుతో పాటు మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతుండడంతో తాజాగా చేపలకు మంచి డిమాండ్ వస్తుంది. జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేపలు నిండుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వమే ఉచితంగా చేపపిల్లల పంపిణీ, రుణాలు, మార్కెటింగ్ సదుపాయం,సమీకృత చేపల మార్కెట్, బీమా, ప్రత్యేక శిక్షణ ప్రోత్సాహంతో మత్స్యకార కుటుంబాల్లో వెలుగులు నిండి నీలి విప్లవం వస్తుంది. దీంతో ప్రజలు తాజా చేపలు లభించడంతో కొనుగోలు చేయడానికి అసక్తి చూపుతున్నారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక చొరవతో 7 ఏళ్లలో జిల్లాలో మత్స్య ఉత్పత్తి రెట్టింపై మత్స్యకారులకు చేపల పెంపకంపై అసక్తి పెరిగింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం జలాశయాలు, కాల్వలతో చెరువులు,కుంటలలో పుష్కలంగా నీరు వచ్చి చేరింది. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేయడంతో మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది. ఒకప్పుడు చెరువుల్లో నీళ్ల లేక కూలీనాలీ పనులకు పోయి జీవనం సాగించిన మత్స్య కుటుంబాలు నేడు జీవన ప్రమాణం పెరిగింది. ఒకప్పుడు మార్కెట్‌లో పూర్తిగా హైదారాబాద్ నుంచి తీసుకు



చెరువు అలుగు పారుతుండడంతో చేపలను పడుతున్న మత్స్యకారులు

వచ్చిన చేపలను విక్రయించేవారు కానీ నేడు స్థానికంగా చెరువు, కుంటల నుంచి తెచ్చిన చేపలనే ఎక్కువగా విక్రయిస్తున్నారు. కొన్ని చెరువుల్లో 3 నుంచి 10 కిలలో వరకు ఉన్న చేపలు దొరుకుతుండడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మాంసం వినియోగం బాగా పెరిగి ధర కిలో రూ.800 పలుకుతుండడంతో చేపలకు డిమాండ్ బాగా పెరిగింది. సిద్దిపేట నియోజకవర్గంలో 56 మత్స్యకార సొసైటీలుగా ఉండగా 3429 మంది సభ్యులు ఉన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత 7 యేండ్ల నుంచి ప్రభుత్వం రూ.2 కోట్ల 79 లక్షల చేప పిల్లలు. గజ్వేల్‌లో రూ. 4 కోట్ల 22 లక్షలు, దుబ్బాక రూ. 4 కోట్ల 84 లక్షలు, హుస్నాబాద్ రూ.2 కోట్ల 47లక్షల చేపపిల్లలను పంపిణీ చేసింది. బెజ్జంకి మండలంలో 77.99 లక్షలు, జనగామ నియోజకవర్గంలోని జిల్లాకు చెందిన మండలాల్లో రూ.2 కోట్ల 97లక్షల చేపపిల్లలను పంపిణీ చేసింది.

జిల్లాలోని 243 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఈ సంఘాలలో 18500 సభ్యులు సొసైటీ పరిధిలోని చెరువులు, కుంటలలో చేపల పెంపం అమ్మకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం కోసం మంత్రి హరీష్ రావు ప్రత్యేక చొరవ తీసుకొని వంద శాతం సబ్సీడిపై చేప పిల్లలను సరఫరా చేపిస్తున్నారు. 2023-24 సంవత్సరంకు గానూ జిల్లాలోని 1634 నీటి వనరులతోపాటు రంగనాయక, కొండపొచమ్మ, మల్లన్న సాగర్ జలాశయాలలో 263.78 లక్షల 80-100 ఎంఎం సైజ్ కలిగిన చేప పిల్లలు, 164.81 లక్షల 35-40 ఎంఎం సైజు కలిగిన చేప పిల్లలు ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేసి వదిలేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి మత్స్యశాఖ ప్రభుత్వంకు పంపింది. త్వరలోనే ప్రభుత్వ అమోద ముద్ర లభించనున్నట్లు సమాచారం.



కడవేర్గు కల్వర్టులో గాడిదకు వినతి పత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

### ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ

## సిపిఐ ఆధ్వర్యంలో గాడిదకు వినతి

**చేర్యాల, జూలై 29,ప్రభాతవార్త :** చేర్యాల మండలం కడవేర్గు గ్రామం నుండి పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేటకు వెళ్లేదారిలో వంతెన నిర్మాణం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేయించకపోవడంతో నిరసనగా శనివారం సిపిఐ ఆధ్వర్యంలో గాడిదకు వినతి పత్రం అందించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ చేర్యాల మండలం నుండే కాకుండా ఇతర మండలాల, గ్రామాల నుండి కడవేర్గు గ్రామం మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట, హైదరాబాద్ పట్టణాలకు వందలాది మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణించే రహదారి రోడ్డు కడవేర్గు కల్వర్టు పూర్తిగా ధ్వంసమై నీరు ప్రవహిస్తుంటే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొవడమే కాకుండా భారిగా కురుస్తున్న వర్షాలకు రాకపోకలు కూడా బంద్ అవుతున్నాయన్నారు.గత సంవత్సరం బ్రిడ్జి నిర్మాణానికి తాత్కాలికంగా రూ.10లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసిన ముత్తిరెడ్డి నేటివరకు పనులు ప్రారంభించకపోవడం వారి అసమర్థత పాలనకు నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యేకు,సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిరసన కార్యక్రమాలు చేసినప్పటికి పట్టించుకోకపోవడంతో శనివారం గాడిదకు వినతి పత్రం అందించి నిరసన వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, వెలుగల యాదగిరి, తిగుళ్ళ కనకయ్య, యాట లక్ష్మయ్య, సిద్ధిరాం భద్రయ్య, మేర్గొజు వెంకటేశం, ఉడుగుల శ్రీనివాస్, రాజు, మల్లేశం, రమేష్, ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాస్ జయదేకర్ సమక్షంలో బిజెపిలో చేరిన జైపాల్‌రెడ్డి



బిజెపి రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్, ఎన్నికల ఇంచార్జి

**జహీరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** మాజీ కాంగ్రెస్ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ యం బాగారెడ్డి తనయుడు మాజీ డిసిసిబి చైర్మన్ యం జైపాల్‌రెడ్డి శనివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. శనివారం ఢిల్లీలో పార్టీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్ చుగ్, ఎన్నికల ఇంచార్జి ప్రకాష్ జయదేకర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరిన జైపాల్‌రెడ్డిన పార్టీ ఖండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికే అరుణ, రాష్ట్ర ప్రచార కమిటి చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎంపి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానం నుంచి ఎంపి పోటీ చేసేందుకు అవకాశాలు కల్పించనున్నట్లు బిజెపి అధిష్టానం నుంచి భరోసా ఇచ్చనట్లు ప్రచారం జరుగుతోంది.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే

## ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం

**నడుస్తూ చెత్తను సేకరించిన మున్సిపల్ పాలక వర్గం**



నడుస్తూ చెత్తను సేకరిస్తున్న కౌన్సిలర్లు తదితరులు

**సిద్దిపేట రూరల్, జూలై 29, ప్రభాతవార్త :** ఆరోగ్యమే మహాభాగ్యం ఇంటి పరిసరాలు పరిశుభ్రంగాఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవు తుందన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న మంత్రి హరీష్‌రావు అదేశాల మేరకు శనివారం సిద్దిపేట మున్సిపల్ 42వ వార్డులో కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్ అధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు నడుస్తూ చెత్తను సేకరించారు. వార్డులోని మురికి కాల్వల్లో, రోడ్లకు ఇరువైపుల పడేసిన ప్లాస్టిక్ వస్తువులు, చెత్త, చెదారాన్ని ఏరివేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగరాజురెడ్డి, గ్యాదరి రవీందర్, వినోద్‌గౌడ్, నాయకం లక్ష్మణ్, రియాజ్, పార్టీ శ్రేణులు సాకి అనంద్, నాగరాజు, అంజనేయులు, దరిపల్లి శ్రీను, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా వార్డులో మహిళ కౌన్సిలర్ కాటం శోభరఘురామ్ స్వయంగా పాలకవర్గంతో కలిసి నడుస్తూ చెత్త ఏరివేత కార్యక్రమంలో పాల్గొని అశ్చర్యానికి గురి చేసింది.

### ఎంపి సోయం బాపురావు గిరిజనులకు క్షమాపణలు చెప్పాలి

**-బిఆర్ఎస్ నేత కాంట్రోత్ రాజేందర్‌నాయక్**

**శివ్వంపేట, జూలై 29 ప్రభాతవార్త:** గిరిజనులకు ఎంపి పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు కాంట్రోత్ రాజేందర్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన తండాల్లో నివసిస్తూ ఎంతో మంది వెనుకబడి ఉన్నారని గతంలో పాలన సాగించిన ప్రభుత్వాలు అనేక సంవత్సరాల నుండి గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చితే లంబాడీలను ఆ జాబితాను తొలగించాలని బీజేపీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు కేంద్ర మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లడంటే కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడమే కాకుండా రాష్ట్రంలోని యావత్తు గిరిజన ప్రజలను అవమానించడమే అని రాజేందర్ నాయక్ అభిప్రాయపడ్డారు. లంబాడీలు పడుతున్న బాధలు, వారి బ్రతుకులు ఎలా ఉన్నాయనే విషయం తెలియకుండా ఎంపీ ఈ విధంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలియన వ్యక్తిగా అజ్ఞానంతో మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావును సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ చందర్‌నాయక్, వార్డు సభ్యులు శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# సిఎం యజ్ఞయాగాదులు చేయం వల్లే సమృద్ధిగా వర్షాలు

**నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

**కొల్చారం, జూలై 29 ప్రభాతవార్త:** సిఎం కేసీఆర్ కాలు ముహూర్తం బాగుంది.. కరువు కాటకాలు దూరమై వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల అలుగులు పొంగి పొర్లుతున్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్చారం గ్రామ శివారులోని కోతుల చెరువును ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సందర్శించారు. వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో అలుగులు పొంగి పొర్లుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అలుగుల వద్ద కొబ్బరి కాయ కొట్టి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం కేసీఆర్ గతంలో యజ్ఞయాగాదులు చేయడం వల్లే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. పంటలు సుభిక్షంగా పండుతున్నాయని అన్నారు. దేశంలోనే వ్యవసాయ రంగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్‌గుప్తా, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్, సర్పంచి కరెంటు ఉమా రాజా గౌడ్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ దేవన్నగారి శేఖర్,


గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

పీఏసీఎస్ చైర్మన్ నాగురి మనోహర్, బీఆర్ఎస్ పార్టీ నేతలు దుర్గాప్రసాద్‌గౌడ్, కారోబార్ వడ్ల ప్రభాకర్, సంజీవరావు, చంటయ్య, పాంద్ర వెంకటే శం, షౌకత్, దొంకెన మల్లయ్య, పోతాగౌడ్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు రోడ్డు సమస్యను విన్నవించిన యువకులు**

కొల్చారం బస్టాండ్‌నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని శనివారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి గ్రామ యువకులు విన్నవించారు. ఈ సందర్భంగా యువకులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో ఈ రోడ్డు విషయమై గత ఎన్నికల సమయంలో డివైడర్, బటర్ ఫ్లై లైట్లతో కూడిన రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే కొల్చారం, నర్సాపూర్ ప్రధాన రహదారి నుండి వవసురాం తండా వరకు రోడ్డు టెండర్ పూర్తయిందని, వర్షాకాలం కావడంతో జాప్యం జరుగుతుందని, ఇప్పటికే వరిగుంతం రోడ్డు పనులు జరుగుతున్నాయని, త్వరలో నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని గుర్తు చేశారు.

# ఘనంగా పీర్లపండగ వేడుకలు


పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, జూలై 29.ప్రభాతవార్త:** ముస్లింలకు ఎంతో పవిత్రమైన మొహర్రం పండగ ను నర్సాపూర్ పట్టణంలో శనివారం ముస్లీం మైనార్టీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ మొహర్రం పండగ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో పలు మసీదుల్లో పీర్లను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను నర్సాపూర్ పట్టణంలో ఊరేగింపును తీయడం జరిగింది. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డిలు పాల్గొన్న అనంతరం మసీదుల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూనర్సాపూర్ పట్టణంలో ఈ విదంగా మొహర్రం (పీర్ల) పండగను జరుపుకోవడం అబినందనీయమని వారు పేర్కొ న్నారు. ఈ పండగను హిందు ముస్లీం లు కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్,పిఏసిఎస్ చైర్మన్ రాజుయా దవ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్ర శేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, నాయకులు కుమ్మరి నాగేశ్, కృపాచారి, ఆంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్‌గుప్త, సూరారం నర్సింలు, రాకేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో..**

**పెద్దశంకరంపేట, జూలై29 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పాత గ్రామ పంచాయితీ వద్ద పీర్లను నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దర్శించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలో దూత్ పీర్లు, లాల్‌సాబ్ పీర్లు, చాన్‌సాబ్ పీర్లు, మౌలాలి పీర్లను భాజా భజంత్రీలతో పట్టణ పుర వీధుల గుండా ఊరేగిస్తూ పాత గ్రామ పంచాయతీ వద్దకు చేరుకున్నారు. ప్రజలు భారీ సంఖ్యలో పాత గ్రామ పంచాయితీ వద్దకు చేరుకొని పీర్లకు తమ మొక్కులను చెల్లించుకున్నారు. పలువురు అసైదుల్లా అంటూ ఆటలు ఆడుతూ ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు, గ్రామ పెద్దలు పీర్ల ఊరేగింపు ఉత్సవాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి సత్యనారాయణ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళీ పంతులు, ఉప సర్పంచి దశరథ్, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ఆర్ఎన్. సంతోష్‌కుమార్, పున్నయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# హుస్నాబాద్‌లో చెత్తపై అవగాహన కార్యక్రమం

**హుస్నాబాద్, జూలై 29,ప్రభాతవార్త** నిరుపయోగంగా వున్న చెత్తను సేకరించి వినియోగమయ్యేలా రీసైకిల్‌చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చేయడంపై ఇరవైవార్డు ప్రజలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అవగాహన కల్పించారు. శనివారం అవగాహప కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి చెత్తను వినియోగించే విషయంలో పాటించాల్సిన తీరును చెప్పారు. తమకు అవసరంలేని వస్తువులు అవసరమైనవారు సమాజంలో చాలా మంది ఉంటారని ఉదాహరణకు బట్టలు, వాహనాలు, వినియోగించిన పుస్తకాలను మూలన పడేయంలాం టివి చేస్తారని కానీ ఇవే పుస్తకాలను భవిష్యత్తులో ఎదుగుతున్న తోటిపిల్లలకు అందిస్తే ఎంతో ఉపయోగముంటుందని వారు చిరకాలం తమను గుర్తుంచుకుంటారని వివరించారు. చెడిపోయిన కుళ్లిపోయిన ఆహారపదార్థాలను సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగించవచ్చని వివరించారు. ఇనుము పదార్థాలను తిరిగి వినియోగించుకుంటే ఇంకో రూపంలో వాడకానికి పనిచస్తుందని ఆకుల రజితవెంకన్న అన్నారు. ప్రజలు తమ సామాజిక బాధ్యతను గుర్తించి ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భగస్వాములు అయ్యే గొప్ప అవకాశం దక్కుతుందని అనితశ్రీనివాసరెడ్డి చెప్పారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేలా అందరం పాటుపడుతూ చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొజ్జ హరీష్, వాలా సుప్రజనవీన్‌రావు, కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, మహ్మద్ అయూబ్‌పాషా, నాయకులు బోజు రవిందర్, మహ్మద్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.


చెత్తపై అవగాహన ఆకుల రజితవెంకన్న


మాసాయిపేటలో ధర్నా చేస్తున్న అఖిల పక్ష నాయకులు

## కార్మికులకు అండగా అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా

**వెల్దుర్తి, జూలై29 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలో నోవెల్ టెక్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం అకారణంగా కార్మికులకు తొలగించినందుకు వారిని వెంటనే ఉద్యోగాల్లో చేర్చుకోవాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకొని యాజమాన్యం మోసం చేసిందని, కార్మికుల పట్ల నోవెల్ టెక్ యాజమాన్యం నశించాలని వారు డిమాండ్ చేశారు. జీఎం, హెచ్ఆర్, ప్రొడక్షన్ మేనేజర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సంవత్సరం నుండి పనిచేస్తున్న మహిళ కార్మికులను తొలగించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. సర్పంచి మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపటీసీ సిద్ధిరాములుగౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి మాదిగ, ఉప సర్పంచి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూలై 29, ప్రభాతవార్త:** అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన భువనేశ్వర రావుని భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో సన్మానించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కపల్లి బాల నర్సగౌడ్, ఉపాధ్యక్షుడు గజబీంకర్ అశోక్, మండల సెక్రెటరిలు కోనపురం బాలు, యాదవరెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శేరిపల్లి తరుణ్, పాతూరి వెంకటస్వామి, వెల్పుల యాదయ్య, రాజు, ఎండి అబిద్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో..** మిరుదొడ్డి, జూలై 29, ప్రభాతవార్త : ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మిరుదొడ్డి ఎస్ఐ నరేష్‌తో పాటు భూంపల్లి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన భువనూశ్వరరావును కాంగ్రెస్ నాయకు లు శనివారం శాలువాలతో సత్కరించారు. అయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మద్దెల రాజేశం, కనకరెడ్డి, మహేందర్, వెంకట్‌గౌడ్, అక్కపల్లి బాలనర్సయ్యగౌడ్, గజబీ ంకర్ అశోక్, పాతూరు వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నిల్వ ఉన్న నీటి తొట్టిని శుభ్రం చేస్తున్న ఆశ వర్కర్ దృశ్యం

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూలై 29, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు, వైద్య ఆరోగ్యశాఖ సూచనలమేరకు ఎఎన్ఎం ప్రమీల ఆధ్వర్యంలో సిజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామ ఆశా వర్కర్లు ర్యాకం లావణ్య, సిద్దిని పుష్పలతలు గ్రామంలో శనివారం ఇంటింటికి తిరుగుతూ వర్షపు నీరు నిల్వ ఉన్న నీటి తొట్టిలను శుభ్ర పరుచుకోవాలని, మన చుట్టు పరిసర ప్రాంతాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రామే త్రాగాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ఏ ఇంటిలోనైన వాంతులు, విరోచనాలు ఉన్న మాకు సమాచారం అందించి భూంపల్లి మండలంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ సాయి తేజశ్వని ఆధ్వర్యంలో మేరుగైె వైద్యం పొందాలన్నారు.

## బాధితులను పరామర్శించిన మామిడి మోహన్ రెడ్డి

**దుబ్బాక, జూలై 29, ప్రభాతవార్త:** పద్మాశాలిగడ్డ, బల్వాంతపూర్, నార్లేన్‌గడ్డ, పట్టణ పరిధిలో దుంపలపల్లి వార్డులోని కలుషిత నీటిని త్రాగి అస్వస్థతకు గురైనా బాధితులు దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పొందుతున్నా వారిని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడి మోహన్ రెడ్డి శనివారం పరామర్శించి బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యకర్తలు మాజీ సర్పంచ్ శ్రీనివాస చారి, నర్సింగా రావు, స్వామి, మురలిగౌడ్, వెంకట్, సర్వారాములు, నర్సింహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ డిఎం వెంకటేశ్వర్లు

## ప్రగతి రథచక్ర అవార్డుగ్రహీతలకు ధృవీకరణ పత్రాల అందజేత

**హుస్నాబాద్ రూరల్, జూలై 29, ప్రభాతవార్త :** సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తూ కర్తవ్య నిర్వహణలో పకడ్బందీగా వ్యవహరిస్తూ ఉత్తమ శిఖరాలాలను అధిరోహిస్తున్న కార్మికులను హుస్నాబాద్ ఆర్టీసిడిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ నేపథ్యంలో ప్రగతి రథచక్ర ఆదర్శ ఉద్యోగులను అభినందిచిన డిఎం వెంకటేశ్వర్లు ఆర్టీసి సంస్థ ప్రజల కోసం పాటుపడుతున్న తీరును ఇంకా ప్రజల్లోకి తీసుకెళ్లి సురక్షితమైన ప్రయాణం ఒక్క ఆర్టీసిలోనే అంటూ అర్థం అయ్యేలా చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రగతిరథచక్ర అవార్డు గ్రహీతలకు ధృవీకరణ పత్రాలను అందచేసారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ జి శ్రీధర్, ట్రాఫిక్‌ఇంచార్జి నరసయ్య,ఏఎంఎఫ్‌డి సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనలపై హుస్నాబాద్‌లో శాంతిర్యాలీ


పట్టణంలో శాంతిర్యాలీ దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, జూలై 29, ప్రభాతవార్త :** మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న అమానవీయకోణంలో కుకీజాతి వారిని హింసిస్తూ చెలరేగిపోతున్న సంఘటనలపై హుస్నాబాద్ పట్టణంలో పాస్టర్స్ డివిజన్‌స్థాయిలో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ అఘాయిత్యాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అరికట్టా లని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్స్ పాల్గొ న్నారు.

## త్వరలో శాశ్వత రోడ్డుపనులు పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే


తాత్కాలిక రోడ్ల పనులను చేయిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

**చేర్యాల, జూలై 29, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. శనివారం చేర్యాల మండలం రాంపూర్ గ్రామం రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పరిశీలించి తాత్కాలిక పనులు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నామని త్వరలో శాశ్వత పనులు చేపడతామన్నారు. గోదావరి, కృష్ణ నదులతో రాష్ట్రంలో అన్ని చెరువులను నింపుతున్న అపరభగీరథుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, రాంపూర్ గ్రామ సర్పంచ్ దినేష్ తివారి, నాయకులు ముస్త్యాల నాగేశ్వర్, శవళ్ళ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన శివ్వంపేట మాజీ సర్పంచ్


ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న స్రవంతి నవీన్‌కుమార్ గుప్త

**శివ్వంపేట, జూలై 29 ప్రభాతవార్త:** నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో శివ్వంపేట మాజీ సర్పంచి పులిమామిడి స్రవంతి నవీన్‌కుమార్‌గుప్త అనుచరులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న స్రవంతి నవీన్‌కుమార్‌గుప్తను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నవీన్‌గుప్తను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ జంగం విజయ వెంకటేష్, సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, బిజిలీపురం సత్తయ్య, కమలయ్యగారి వెంకటేష్, కొడకంచి రవీందర్‌గౌడ్, ఇసుగారి అరుణ్, కాముని నాగేష్, కొడకంచి గణేష్‌గౌడ్, ఇసారపు రాజు, లస్కరి అంజయ్య తదితరులు ఉన్నారు.

## కారు వాగులో కొట్టుకుపోయిందని షికార్లు చేసిన పుకార్లు గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు


అక్కనపల్లి వాగు వద్ద గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

**నంగునూర్, జూలై 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అక్కనపల్లి వాగులో శుక్రవారం రాత్రి కారు కొట్టుకుపోయిందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బస్వాపూర్ వద్ద మోయతుమ్మద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అక్కనపల్లి మీదుగా వెళ్లడానికి రాత్రి సమయంలో కారు వచ్చిందని అ కారు వరద నీటిలో కొట్టుకుపోయిందని పుకార్లు షికార్లు చేయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కనపల్లి వాగు వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు గజ ఈతగాళ్లతో, మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టిన ఎటువంటి అచూకి లభించలేదని పోలీసులు తెలిపారు. కారు వాగులో కొట్టుకుపోయిందా లేదా అన్న విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## గోల్కొండ వీధిలో పర్యటించిన మున్సిపల్ వైస్ చైర్మన్

**మెదక్ అర్బన్, జూలై29 ప్రభాతవార్త:** మెదక్ పట్టంనలోని 27వ వార్డు గోల్కొండ వీధిలో కౌన్సిలర్ కసాపురం మధు, కిరణ్‌ల ఆధ్వర్యంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ కలియ తిరుగుతూ మొన్నటి భారీ వర్షానికి దెబ్బతిన్న సొన్నాయిల పరమేశ్వర్, రాజంపేట కిషన్, నర్సుపల్లి ప్రసాద్‌ల ఇండ్లను పరిశీలించారు. ముత్తాయికోట మాజీ సర్పంచి కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్‌వీ పట్టణ కార్యదర్శి కసాపురం కిరణ్, వార్డు సభ్యులు సొన్నాయిల పరమేశ్వర్, రాజంపేట కిషన్, నర్సుపల్లి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## వెల్దుర్తిలో ఘనంగా మొహర్రం వేడుకులు

**వెల్దుర్తి, జూలై29 ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా శనివారం శనివారం ముస్లిం, హిందువులు కలిసి మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంనరదమైన వెల్దుర్తిలో పీర్లను నిలబెట్టి డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. అనంతరం ఉన్నత పాఠశాల మైదానంలో దూర్ పీర్, పీర్లను నిలబెట్టడంతో అక్కడి చెరుకున్న ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు.


మృతుల కుటంబాలను పరామర్శిస్తున్న బోయిని వినోద్, వొడతెల సతీష్

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**హుస్నాబాద్, జూలై 29, ప్రభాతవార్త :** ప్రకృతిని ఎదిరించి ముందుకు సాగలేమని మనమే స్వీయనియంత్రణ పాటించాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ వ్యాఖ్యానించారు. శనివారం రెండురోజుల క్రితం కురిసన భారీ వర్షాల నేపథ్యంలో మృతిచెందిన కుటుంబా లను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కన్నపేట మండలం కన్నారం వాగులో పడి మృతి చెందిన మహేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో రైతు వాగులో పడి మృతి చెందిన రైతు ఎడెల్లి రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, అక్కన్నపేట జడ్పీటిసి భూక్య మంగ శ్రీనివాస్, ఎంపిపి మాలోతు లక్ష్మిభీలూనాయక్, హుస్నాబాద్ మార్కెట్ కమటీ చైర్మన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి, నవాబపేట సర్పంచ్ సుద్దాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు

**హుస్నాబాద్, జూలై 29, ప్రభాతవార్త :** త్యాగాలకు ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను హుస్నాబాద్‌లోని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పీరీలను కొలుస్తూ పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రమంలో మొహర్రం వేడుకలను ఆస్వాదించే హిందువులు సైతం పీరీలను కొలుస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీరీల పండుగను నిర్వహించుకునే హిందువులు సైతం విచిత్ర వేషధారణతో సందడి చేశారు.

## జల హనుమాన్ ఆలయంలో పూజలు, అన్నదానం


జలహనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

**నర్సాపూర్,నర్సాపూర్ రూరల్, జూలై 29.ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొనిశ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు దాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన శేఖర్‌గుప్త కుటుంభ సభ్యులు మరియు రాకేశ్‌చౌదరి కుటుంభ సబ్యుల తో పాటు భక్తులు భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం,పంచామృ తాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం దాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన శేఖర్‌గుప్త కుటుంభ సభ్యులు మరియు రాకేశ్‌చౌదరి కుటుంభ సబ్యుల అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి,దాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన శేఖర్‌గుప్త కుటుంభ సభ్యులు మరియు రాకేశ్‌చౌదరి కుటుంభ సబ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

**పెద్దశంకరంపేట, జూలై29 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్ఎం. సాయికుమార్ శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. కాగా సాయికుమార్ సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గత వారం రోజులు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఉపాధ్యాయుడు సాయికుమార్ భౌతిక కాయానికి పెద్దశంకరంపేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, కేంనరద ఫుడ్ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆసూరి రామచంద్రచారి, సర్పంచి అలుగుల సత్యనారాయణ, మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళీ పంతులు, తోటి ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

## మృతి చెందిన చిన్నారి అక్షర కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దుర్తి, జూలై29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని పెద్దమ్మగడ్డ తండాకు చెందిన పది సంవత్సరాల అక్షర అనే బాలిక ఇటీవల మృతి చెందింది. శనివారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, శేఖర్, మల్లేశం, మహేందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు మృతురాలు అక్షర కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారి అక్షరకు కడుపునొప్పితో మృతి చెందడం పట్ల ప్రతిపక్ష నాయకులు లేనిపోని నిందలు వేస్తూ ఆరోపణలు చేస్తున్నారని, ఇది వారికి తగదన్నారు. ఇటీవలే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తండాలో గ్రామ పంచాయితీ నూతన భవనాన్ని ప్రారంభించారని, అలాగే రోడ్డు నిర్మాణానికి నిదులు మంజూరు చేయడం జరిగిందని, వర్షాకాల కారణం గా పనులు జరగలేదన్నారు. ఇందుకు ప్రతిపక్ష నాయకులు రోడ్డు బాగోలేక వైద్యం అందక అక్షర మృతి చెందిందని అనడం సరికాదన్నారు. పది రోజులుగా భారీ వర్షాలు పడటం వల్ల మంచి మంచి రోడ్లు సైతం గుంతలమయంగా మారాయని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదనడం సరికాదన్నారు. గతంలో వెల్దుర్తికి రావాలంటే గుంతల మయమైన రోడ్డు ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు తరువాత అట్టి రోడ్లను తూప్రాన్ నుండి వెల్దుర్తి, వెల్దుర్తి నుండి నర్సాపూర్ వరకు డబుల్ రోడ్డు చేయడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తండాలను గ్రామ పంచాయితీలను గుర్తించి తండాలలో సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. అభివృద్ధి జరగడం లేదని చేస్తున్న విమర్శలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల దేవస్థానంలో భక్తుల సందడి

**శివ్వంపేట, జూలై29 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తుల సందడి పెరిగింది. అధిక శ్రావణ మాసం కావడంతో హైదరాబాద్ నగరం నుండే కాకుండా పలు జిల్లాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన ప్రముఖులకు దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖులలో దుండిగల్‌కు చెందిన వ్యాపారవేత్తలు కొర్ర నాగేష్ నాయక్, కొర్ర శంకర్ నాయక్, కొర్ర రవీందర్‌నాయక్, శివ్వంపేట మాజీ సర్పంచి స్రవంతి నవీన్‌కుమార్ గుప్త, చెర్విరాలశ్రీనివాస్‌గుప్త తదితరులు ఉన్నారు. చాకరిమెట్ల దేవస్థానాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ వ్యాపారవేత్త కొర్ర శంకర్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహణాధికారి సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ ఉన్నారు.

**ఆధునీకరణ దిశగా ఆహోబిల క్షేత్రం**

భక్తుల సౌకర్యార్థం శ్రీఆహోబిల మఠం పరంపరాధీన శ్రీలక్ష్మీన రసింహ స్వామి దేవస్థానాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించి డిజిటలైజేషన్ గావించనున్నామని పీఠాధిపతి శ్రీరంగసాథయంతీ మహాదేశికులు పేర్కొన్నారు. నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ప్రతి ఏటా తమ ఆలయాన్ని లక్షమంది భక్తులు దర్శించి తీర్థప్ర సాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు అవుతున్నారు. వీరికి మరింత ఉత్తమంగా సౌకర్యాలు కల్పించేందుకు తాము నిశ్చయించటం జరిగిందన్నారు.

